
# సాక్షి ఒడిశా

శనివారం । 3 । ఫిబ్రవరి । 2024

**శ్రీమందిరం ఆదాయం లెక్కింపు**


భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,72,526లు, బంగారం 4 గ్రాముల 800 మిల్లీగ్రాములు, వెండి 7 గ్రాములు 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



**భాషా వేడుకకు వేళాయె..!**

రాష్ట్రంలో శనివారం నుంచి ప్రపంచ ప్రథమ ఒడియా భాషా సదస్సు ప్రారంభమవ్వనుంది.

- 8లో



**ఆకాశానికి వెల్లుల్లి ధర**

రాష్ట్రంలో వెల్లుల్లి ధర ఆకాశాన్నంటుతోంది. దీంతో సామాన్యులు ఆందోళనకు గురవుతున్నారు.

- 8లో

## న్యూస్‌రీల్

### యాత్రికుల బస్సును ఢీకొన్న లారీ

- 20 మందికి స్వల్ప గాయాలు



బస్సును ఢీకొన్న లారీ

భువనేశ్వర్/రాయగడ: పూరీలోని ప్రాకార ప్రాజెక్టు సందర్శించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా బస్సులను ఏర్పాటు చేసి యాత్రికులను తీసుకెళ్తోంది. దీనిలో భాగంగా జిల్లాలోని గుడారి నుంచి బయల్దేరిన బస్సు భువనేశ్వర్ సమీపంలోని ఖుర్దా పారిశ్రామిక ప్రాంతం గుడాఖొర్దా కూడలిలో ప్రమాదానికి గురయ్యింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న 20 మందికి పైగా యాత్రికులు గాయాలకు గురయ్యారు. శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ఈ ఘటనలో క్షతగాత్రులను ఖుర్దా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న బిజు స్వస్థ్య సమితి రాష్ట్ర శాఖ ముఖ్య సలహాదారుడు సుధీర్ దాస్ సంఘటన స్థలానికి చేరుకొని యాత్రికుల బాగోగులు తెలుసుకున్నారు. గుడారి నుంచి 42 మంది యాత్రికులు గురువారం రాత్రి పూరీకి బస్సులో బయల్దేరారు. ఖుర్దా సమీపించగానే వెనుక నుంచి ఒక లారీ బలంగా బస్సును ఢీకొంది. దీంతో బస్సు వెనుక భాగం పూర్తిగా దెబ్బతినడంతో పాటు అందులో ప్రయాణించే వారికి గాయాలయ్యాయి. పూరీ జిల్లా కలెక్టర్ చంచల్ రణ ఆస్పత్రికి వెళ్లి ప్రయాణికులతో మాట్లాడారు. ప్రాథమిక చికిత్స అనంతరం వారిని పూరీకి తరలించారు.


### ఐదుగురు దొంగలు అరెస్టు



అరెస్టైనవారిని చూపిస్తున్న పోలీసులు

బరంపురం: గంజాం జిల్లాలోని దిగపండి పోలీసుస్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన దోపిడీ ఘటనకు సంబంధించి ఐదుగురు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. ఐఐసీ అధికారి బసంత్ కుమార్ సెఠి తెలిపిన వివరాల మేరకు.. బుధవారం రాత్రి దిగపండి పోలీసుస్టేషన్ పరిధి గురుబడ గ్రామంలోని తులసీ విహార్‌లో నివసిస్తున్న గణేష్ పండా ఇంట్లో దొంగలు చొరబడి బంగారు ఆభరణాలు, రూ.25 వేల నగదు దోచుకున్నారు. దీంతో బాధితులు దిగపండి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఘటనకు సంబంధించి ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 186.5 గ్రాముల బంగారు ఆభరణాలు, ఇత్తడి సామగ్రి, మూడు సెల్‌ఫోన్లు, 2 ఏటీఎంలు, ఒక పల్సర్ బైక్, ఐరన్ రాడ్ సీజ్ చేశారు. అరెస్టైనవారికి జిల్లాలోని దిగపండి పోలీసుస్టేషన్, కె.నువాగాం, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాకి చెందిన మెళియాపుట్టిలో ఇటీవల జరిగిన దోపిడీలతో సంబంధం ఉన్నట్లు తెలియజేశారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



రోడ్డుపై తీవ్రగాయాలతో పడివున్న పెంటియ

జయపురం: రోడ్డు దాటుతున్న వ్యక్తిని వ్యాన్ ఢీకొనడంతో మృతి చెందిన ఘటన ఉమ్మిరి గ్రామ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే జయపురం సదర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. వారు తెలిపిన వివరాల మేరకు.. గురువారం రాత్రి పెంటియ అనే వ్యక్తి ఉమ్మిరి గ్రామం వద్ద 26వ నంబర్ జాతీయ రహదారి దాటేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో జయపురం నుంచి నవరంగపూర్ వెళ్తున్న వ్యాన్ అతడిని ఢీకొంది. దీంతో తీవ్రగాయాలు పాలైన అతడిని హుటాహుటిన జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతడు మరణించినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. పెంటియ మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పటించారు. జయపురం సదర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### జోరుగా 'ఇంటింటా శంఖం'

పర్లాకిమిడి: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీజేడీ నాయకులు ఇంటింటా శంఖం కార్యక్రమాన్ని జోరుగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా కాశీనగర్, గుసాని, ఆర్.ఉదయగిరిలలో గజపతి జిల్లా బీజేడీ యువజన అధ్యక్షుడు శాసనం లింగరాజు ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాల ప్రచారం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. బీజేడీ హయాంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని తెలియజేశారు. కార్యక్రమంలో బీజేడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# జీవితాన్ని మలుపుతిప్పిన హనుమాన్

## సాక్షితో హనుమాన్ చిత్రం చీఫ్ అసోసియేట్ డైరెక్టర్ నాయక్ చిట్‌చాట్

ఈ ఏడాది సంక్రాంతికి సందర్భంగా దేశ వ్యాప్తంగా విడుదలైన తెలుగు చిత్రం హనుమాన్ సూపర్ డూపర్ హిట్‌గా నిలిచింది. ప్రేక్షకులను అలరించిన ఈ చిత్రం కలెక్షన్లతో దుమ్మురేపింది. ఈ చిత్రానికి చీఫ్ అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేసిన వ్యక్తి మిలాన్ కుమార్ రాయగడకు చెందినవాడు కావడం ఒడిశాకు ఎంతో గౌరవాన్ని తెచ్చిపెట్టిందనడంలో సందేహం లేదు. ఆయన స్థానిక సాయిప్రియ నగర్‌లో నివాసముంటున్నారు. చిత్రం హిట్ కావడంతో అతను స్వగ్రామానికి (రాయగడ) వచ్చిన సందర్భంగా సాక్షితో ముచ్చటించి అనుభవాలు పంచుకున్నారు.

– రాయగడ



తల్లిదండ్రులతో మిలాన్

సాక్షి ఇంటర్వ్యూ

**సాక్షి:** మీ నేపథ్యం ఏంటి..?

**మిలాన్ కుమార్:** రామచంద్ర నాయక్, జ్యోత్స్న నాయక్‌లు మా అమ్మానాన్నలు. వృత్తి పరంగా నాన్న రామచంద్ర జేకేపూర్‌లోని పేపర్ మిల్‌లో పనిచేశారు. దీంతో +2 వరకు జేకేపూర్‌లోని ఎల్‌పీఎస్ పబ్లిక్ స్కూల్‌లో చదువుకున్నాను. అనంతరం గజపతి జిల్లా పర్లాకిమిడిలో ఇంజినీరింగ్ పూర్తి చేశాను.

**సాక్షి:** సినిమాలపై ఎప్పటినుంచి ఆసక్తి ఉండేది..?

**మిలాన్ కుమార్:** చిన్న వయసు నుంచే సినిమాలపై ఆసక్తి ఎక్కువగా ఉండేది. ఇంజినీరింగ్ పూర్తయ్యాక ఉద్యోగ రీత్యా బొంబాయి వెళ్లాను. అక్కడ కొంత మంది స్నేహితుల సహకారంతో హిందీ చిత్రసీమలో అడుగు పెట్టి లుప్తా, మోదీకి బేటి సినిమాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశాను.

**సాక్షి:** హైదరాబాద్ ఎప్పుడు షిఫ్ట్ అయ్యారు..?

**మిలాన్ కుమార్:** డైరెక్షన్ రంగంలో కాస్త అనుభవం సాధించిన తర్వాత 2019లో హైదరాబాద్ షిఫ్ట్ అయ్యాను. ఇక్కడ తెలుగు చిత్రరంగంలో ఓంకార్ దర్శకత్వంలో రూపొందించబడిన రాజుగారి గది–3, అదేవిధంగా హీరో మంచువిష్ణు నటించిన మోసగాళ్లు చిత్రాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా అవకాశాలు లభించాయి.

**సాక్షి:** బుల్లి తెరపై పనిచేశారు కదా..?

**మిలాన్ కుమార్:** చిత్రసీమ రంగంలో మెలకువలు అధ్యయనం చేసిన తర్వాత యాడ్స్ ఫిల్మ్స్‌లో పనిచేశాను. నందమూరి బాలకృష్ణ అన్‌స్టాపబుల్, అక్కినేని నాగార్జున హోస్ట్ చేసిన బిగ్‌బాస్–6 సీజన్ షోలకు యాడ్ ఫిల్మ్‌లు చేశాను. అక్కడ పరిచయాలు పెరగడంతో డైరెక్టర్ ప్రశాంత్ వర్మ హనుమాన్ సినిమాకు చీఫ్ అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేసే అవకాశం లభించింది.

**సాక్షి:** ప్రశాంత్ వర్మతో అనుభవాలు ఏంటి..?

**మిలాన్ కుమార్:** వర్మ దర్శకత్వంలో ఎన్నో మెలకువలు, విషయాలు తెలుసుకునే అవకాశం కలిగింది. అతనితో పనిచేయడం ఎంతో ఆనందాన్ని ఇవ్వడంతో పాటు అది నా అదృష్టంగా భావిస్తున్నాను. హనుమాన్ చిత్రం మంచి హిట్ కావడంతో ఆయన దర్శకత్వం వహిస్తున్న మరిన్ని చిత్రాల్లో కూడా అవకాశం కల్పిస్తున్నారు. అందుకు ఆయనకు ధన్యవాదాలు తెలుపుతున్నాను.



సెట్‌లో మిలాన్

**సాక్షి:** హనుమాన్ తర్వాత ఎలా ఉంది..?

**మిలాన్ కుమార్:** హనుమాన్ చిత్రం నా జీవితం మలుపుతిప్పింది. ఒడియా ప్రాంతానికి చెందిన వాడిని అయినా తెలుగులో అనర్గళంగా మాట్లాడగలను. నాలో ప్రతిభను గుర్తించిన హనుమాన్ చిత్ర దర్శకులు వర్మ ఆ సినిమాలో అవకాశం కల్పించడంతో మంచి పేరు, గుర్తింపు వచ్చింది. భవిష్యత్‌లో మరిన్ని మంచి చిత్రాల్లో పనిచేసేందుకు అవకాశం కలుగుతోంది.

**సాక్షి:** హనుమాన్ సమయంలో గుర్తుండిపోయే ఘటన..?

**మిలాన్ కుమార్:** హనుమాన్ సినిమాలోని నీటి లోపలి సన్నివేశం ముంబాయిలో చిత్రీకరించేందుకు వెళ్లాము. ఆ సన్నివేశం తీయడానికి రెండు రోజులు సమయం పడుతుందని ముందుగా భావించాము. అయితే ఆ సన్నివేశాలకు దర్శకత్వం వహించమని వర్మ నాకు బాధ్యతలు అప్పగించారు. దీంతో కష్టపడి ఒక్క రాత్రిలోనే పూర్తి చేశాము. ఈ అనుభూతి నాకు మరుపురానిది.



హీరోకు సూచనలిస్తున్న మిలాన్ కుమార్ నాయక్



సన్నివేశాల్లో దర్శకత్వం వహిస్తుండగా..

**సాక్షి:** చాలా రోజుల తర్వాత వచ్చినట్లు ఉన్నారు..?

**మిలాన్ కుమార్:** హనుమాన్ చిత్రం మంచి హిట్ కావడంతో ఆ ఆనందాన్ని తల్లిదండ్రులతో పంచుకునేందుకు రాయగడ వచ్చాను. చలన చిత్రరంగంలో ప్రవేశించేందుకు వాళ్లు నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. నా తల్లిదండ్రుల ఆశీర్వాదమే నాకు ఇంత పేరు తీసుకొచ్చింది. భవిష్యత్‌లో మరిన్ని మెట్లు అధిరోహించేందుకు కృషి చేస్తాను.

**సాక్షి:** సినిమాల్లో నటించడంపై మీ అభిప్రాయం..?

**మిలాన్ కుమార్:** సినిమాల్లో నటించాలనే ఉద్దేశం లేదు. మంచి దర్శకుడిగా ప్రేక్షకుల మనసులో స్థానం సంపాదించుకోవాలన్నది నా లక్ష్యం.

**సాక్షి:** ఒడియా చలన చిత్రాలకు దర్శకత్వం వహిస్తారా..?

**మిలాన్ కుమార్:** అవకాశం వస్తే తప్పకుండా చేస్తాను. కానీ తెలుగు చిత్రరంగంలో ఎక్కువ శాతం సమయం కేటాయిస్తాను.

**సాక్షి:** యువతకు మీరు ఇచ్చే సందేశం..?

**మిలాన్ కుమార్:** ఏ రంగంలోనైనా ఆసక్తి ఉంటే ఆ రంగంలో రాణించేందుకు పట్టుదలతో కృషి చేయాలని. మన పని సక్రమంగా చేసుకుంటే అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయి.

# నేడు రాష్ట్రానికి పీఎం మోదీ

- ఝార్సుగుడ మీదుగా సంబల్‌పూర్ పర్యటన
- పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన





సన్నాహక సమావేశంలో పాల్గొన్న డీజీపీ అరుణ్‌కుమార్ తదితరులు

భువనేశ్వర్: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక్కరోజు రాష్ట్ర పర్యటనకు శనివారం విచ్చేయనున్నారు. దీనిలో భాగంగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) సంబల్‌పూర్ శాశ్వత క్యాంపస్‌ను ప్రారంభించనున్నారు. అలాగే అనేక ఇతర ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. సంబల్‌పూర్ రెమెడ్ ఛక్ సమీపంలో బహిరంగ సభని ఉద్దేశించి ప్రసంగిస్తారు. రాబోయే ఎన్నికలకు ముందు పశ్చిమ ఒడిశాలో భారతీయ జనతా పార్టీ ప్రచారానికి స్పష్టమైన పిలుపునిస్తారు. ఐఐఎం–సంబల్‌పూర్ క్యాంపస్‌తో పాటు రూ.348 కోట్లతో అమలు చేయనున్న సంబల్‌పూర్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పలు భారీ విద్యుత్ ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు. ఝార్సుగుడ ప్రధాన పోస్టాఫీసు హెరిటేజ్ భవనాన్ని ప్రధానమంత్రి జాతికి అంకితం చేయనున్నారు. పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ శనివారం ఉదయం న్యూఢిల్లీ నుంచి విమానంలో ఝార్సుగుడ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో సంబల్‌పూర్‌లోని తాత్కాలిక హెలిప్యాడ్‌కు చేరుకుని, మధ్యాహ్నం 2.15 గంటలకు ఐఐఎం క్యాంపస్‌కు చేరుకుంటారు.

**ఉన్నత స్థాయి సన్నాహక సమావేశం**

ప్రధాని పర్యటన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ జెనా అధ్యక్షతన స్థానిక లోక్‌సేవా భవన్‌లో ఉన్నత స్థాయి సన్నాహక సమావేశం జరిగింది. ప్రామాణిక నిబంధనల ప్రకారం ఝార్సుగుడ విమానాశ్రయంతో సహా సంబల్‌పూర్‌లోని తాత్కాలిక హెలిప్యాడ్‌ల వద్ద భద్రతా తదితర అనుబంధ ఏర్పాట్లు చీఫ్ సెక్రటరీ సమీక్షించారు. ప్రధానమంత్రి పర్యటన ప్రారంభం నుంచి చివరి వరకు కట్టుదిట్టంగా పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశించారు.

**డ్రోన్ కెమెరాలు నిషేధం**

ప్రధాన మంత్రి పర్యటన పురస్కరించుకుని ఝార్సుగుడ, సంబల్‌పూర్‌లోని ఏదైనా వేదికపై లేదా విమానాశ్రయం, హెలిప్యాడ్‌లో డ్రోన్ కెమెరాలను ఉపయోగించడాన్ని స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్‌పీజీ) నిషేధించింది. బాలాసోర్ జిల్లా బహనాగాలో గతేడాది జూన్‌లో ట్రిపుల్ రైలు ప్రమాదం తర్వాత ఒకరోజు తన పర్యటనలో డ్రోన్ కెమెరాలను వినియోగించారు. ఈ వ్యవహారంలో ప్రధాని భద్రతకు ముప్పు ఉందని ఎస్‌పీజీ అభిప్రాయపడినట్లు అనుబంధ వర్గాల సమాచారం. ఈ నేపథ్యంలో చర్యలు తీసుకోవాలని జిల్లా మేజిస్ట్రేట్, సెక్యూరిటీ అధికారులకు ఆదేశించారు. అదేవిధంగా కార్యక్రమం జరిగే స్థలంలో నిరంతర విద్యుత్ సరఫరాకు ఎటువంటి అంతరాయం లేకుండా ముందు నుంచి జాగ్రత్త వహించాలని ప్రత్యేకంగా జిల్లా యంత్రాంగానికి సూచించారు. అదనంగా 2 జనరేటర్లు ఉంచాలని, ప్రధాని ప్రసంగంలో మైకులు మొరాయించకుండా ఉండాలని స్పష్టం చేశారు.

**ప్రత్యక్ష ప్రసారం**

పీఎం పర్యటన ఆద్యంతాలు దూరదర్శన్, పీఐబీ ప్రత్యక్ష ప్రసారం చేస్తాయి. రాష్ట్ర సమాచార, ప్రజా సంబంధాల శాఖ ఈ ప్రక్రియని సమన్వయ పరుస్తుంది. కార్యక్రమం జరిగే ప్రదేశంలో ఇంటర్నెట్ సౌకర్యం, అగ్నిమాపక వ్యవస్థ, భద్రతా వ్యవస్థ కోసం హోం శాఖ ద్వారా కంట్రోల్ రూం ఏర్పాటు చేయనున్నారు. ఉన్నత స్థాయి సన్నాహక సమావేశంలో రాష్ట్ర అభివృద్ధి కమిషనర్ అనూ గార్గ్, హోం శాఖ అదనపు ముఖ్య కార్యదర్శి దేవ్ రంజన్ కుమార్ సింగ్, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అరుణ్ కుమార్ షడంగి పాల్గొన్నారు.

# ఎన్‌సీసీ విద్యార్థులకు గవర్నర్ సత్కారం



ఎన్‌సీసీ విద్యార్థులతో గవర్నర్ రఘుబర్ దాస్ తదితరులు

భువనేశ్వర్: న్యూఢిల్లీలో ఇటీవల ముగిసిన గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో తొమ్మిదో స్థానం సాధించిన 122 మంది ఎన్‌సీసీ విద్యార్థులకు రాష్ట్ర గవర్నర్ రఘుబర్ దాస్ ప్రత్యేకంగా సత్కరించారు. స్థానిక రాజ్‌భవన్‌లో శుక్రవారం ప్రత్యేక ఎట్ హోం కార్యక్రమం నిర్వహించి వీరిని సత్కరించి అభినందించారు.

యువతే దేశానికి భవిష్యత్ అన్నారు. ఎన్‌సీసీ యువ విద్యార్థుల క్రమశిక్షణ, అంకితభావం దేశానికి సేవ చేసే స్ఫూర్తిని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి పలువురు ఎన్‌సీసీ అధికారులు హాజరయ్యారు.

# ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి


- లాబీయింగ్ లేకుండా టికెట్లు
- రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి అజయ్ కుమార్

భువనేశ్వర్: ఈ ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికలు పురస్కరించుకుని కాంగ్రెసు పార్టీ సరికొత్త శైలిలో సిద్ధమవుతోంది. ఎన్నికల్లో పోటీ చేసే ఔత్సాహిక అభ్యర్థుల సౌకర్యం కోసం ఆన్‌లైన్ వ్యవస్థని ప్రవేశపెట్టినట్లు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి అజయ్ కుమార్ తెలిపారు. త్వరలో జరగనున్న లోక్‌సభ, రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు సిద్ధమవుతున్న కాంగ్రెస్ టికెట్ ఆశించిన అభ్యర్థులు సమగ్ర సమాచారంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు స్థానిక కాంగ్రెస్ భవన్‌లో జరిగిన పార్టీ సమావేశం అనంతరం వివరాలు వెల్లడించారు. టికెట్ ఆశావాహులకు లాబీయింగ్ బెడద లేకుండా ఆన్‌లైన్ వ్యవస్థని ప్రవేశపెట్టినట్లు వివరించారు. కాంగ్రెస్ అభ్యర్థులుగా ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న పార్టీ నాయకులు, ఇతరులు పార్టీ పరిశీలన కోసం అవసరమైన అన్ని వివరాలను అందించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆయనతో పాటు ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఓపీసీసీ) అధ్యక్షుడు శరత్ పట్నాయక్, ఏఐసీసీ స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మధుసూదన్ మిస్త్రీ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

**త్వరలో దరఖాస్తుల స్వీకరణ**

అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ఎన్నికలకు పార్టీ అభ్యర్థులను సిఫార్సు చేయడానికి స్క్రీనింగ్ కమిటీలను ప్రకటించిన తర్వాత రాష్ట్ర పార్టీ యూనిట్ రాబోయే ఎన్నికల కోసం టిక్కెట్ల పంపిణీ ప్రక్రియను ప్రారంభించనుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు సంబంధించిన లింక్‌ను త్వరలో అన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో ప్రసారం చేయనున్నారు. సమగ్ర ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని అజయ్ కుమార్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుదారుల నేపథ్యాన్ని తనిఖీ చేయడానికి ఒక సర్వే బృందం నిమగ్నమై ఉంటుంది. ఈ ప్రక్రియలో పూర్తి పారదర్శకత కొనసాగుతుందని వివరించారు. ఈ బృందం పరిశీలన తర్వాత సమగ్ర సమాచారంతో కూడిన నివేదికను స్క్రీనింగ్ కమిటీకి పంపుతుంది. ప్యానెల్ సిఫారసుల ప్రకారం అర్హులైన అభ్యర్థులకు టిక్కెట్లు ఇస్తారు. ఎంపిక ప్రక్రియలో పార్టీ ప్రాధాన్యత లేదా లాబీకి అవకాశం లేదని పేర్కొన్నారు. దరఖాస్తుకు ఎటువంటి పరిమితి లేదని స్పష్టం చేశారు.

# ప్రకృతి వైపరీత్యాలపై అప్రమత్తత అవసరం



వేదికపై ఏడీఎం రామేశ్వర్ తదితరులు

- ఏడీఎం రామేశ్వర్ ప్రధాన్



సమావేశంలో పాల్గొన్న అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

రాయగడ: ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్నివేళలా అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ రామేశ్వర్ ప్రధాన్ అన్నారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో అధికారులతో అత్యవసర సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వైపరీత్యాలు ఎదుర్కోవడంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థలు సమన్వయంగా కృషి చేయాలని ఆకాంక్షించారు. రానున్న వేసవిలో తాగునీటి కొరత లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో కమిటీలను ఏర్పాటు చేసి చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. నాటకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అదేవిధంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు వంటివి నిర్వహించి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఎలా ఎదుర్కోవాలో వివరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహక అధికారి నిహారి రంజన్ కుహరో, 11 సమితుల బీడీవోలు, తహసీల్దార్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆడిటోరియం నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: స్థానిక మహిళా కళాశాలలో ఆడిటోరియం నిర్మాణానికి పర్లాకిమిడి ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు శుక్రవారం భూమిపూజ చేశారు. ప్రభుత్వ ఎయిడెడ్ మహిళా కళాశాలకు కోడూరు నారాయణరావు అధ్యక్షునిగా వ్యవహరిస్తున్నారు. తన ఎమ్మెల్యే నిధుల నుంచి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించారు. కార్యక్రమంలో మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్యాణి మిశ్రా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ఆలయం ప్రారంభం**

అలాగే కాశీనగర్ సమితి కిడిగాం గ్రామంలో కొత్తగా నిర్మించిన విష్ణు ఆలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మందిరం అభివృద్ధికి రూ.2 లక్షలు మంజూరు చేశారు. కార్యక్రమంలో కాశీనగర్ సమితి మాజీ అధ్యక్షుడు ఛిత్రి సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### వైద్యుడిపై చేయిచేసుకున్న మహిళ అరెస్టు



అరెస్టు అయిన సుజ్ఞాని గమాంగ్

పర్లాకిమిడి: స్థానిక జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో విధుల్లో ఉన్న వైద్యుడు రష్మికాంత మిశ్రాపై చేయిచేసుకున్న సుజ్ఞాని గమాంగ్ అనే మహిళను, వైద్యుడి ఫిర్యాదుతో అరెస్టు చేసినట్లు ఐఐసీ ప్రశాంత భూపతి శుక్రవారం తెలియజేశారు. వైద్యుడిని కొట్టినప్పుడు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో ఉద్దేశపూర్వకంగా పోస్టు చేయడం నేరమన్నారు. ఆమెపై ఇదివరకు రెండు కేసులు నమోదైనట్లు వెల్లడించారు. కాగా ఆమెను రిమాండ్‌కు తరలించడంపై జిల్లా ఆదివాసీ సంఘం సభ్యులు మండిపడ్డారు. గతంలో సుజ్ఞాని కూతురు నవోదయ విద్యాలయం హాస్టల్‌లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటనలో ఆమె పలుమార్లు కలెక్టరేట్, పోలీసుల ఎదుట ధర్నాకు దిగింది.

### రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్‌సీపీ నాయకునికి తీవ్ర గాయాలు

మందస: మండలంలోని మూలిపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు తెలుకల గురుమూర్తికి శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. చిన్న కుమారుడి వివాహానికి శుభలేఖలు పంచడానికి పెద్ద కుమారుడు జగన్నాథంతో బైక్‌పై వెళ్తున్న ఆయనకు ప్రమాదం జరిగింది. తల వెనుక భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పెద్ద కుమారుడికి కూడా గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రుడిని పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలను అందించాలని వైద్యులకు చెప్పారు. ఆయనతో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మూలిపాడు సర్పంచ్ గుసిరి వెంకటరావు, దద్ద కిరణ్‌కుమార్, తెలుకుల సురేష్, దట్టి కోదండరావు, బైలాడుచైనీ ఉన్నారు.

### రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరు గ్రామానికి చెందిన బత్తిని కృష్ణారావు(55) శుక్రవారం పలాస రైల్వేస్టేషన్‌లో రైలు దిగుతుండగా ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందారు. ఈయన విజయవాడలో కూలి పనులు చేసుకుంటూ బతుకుతున్నారు. స్వగ్రామం వస్తున్న తరుణంలో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు బంధువులు, కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా మృతునికి భార్య పార్వతి, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కృష్ణారావు మృతిపై గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఆయన మృతిపై వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పుక్కళ్ల గురయ్యనాయుడు, పార్టీ నాయకులు ఇరోతు హేమంత్, పుక్కళ్ల లక్ష్మణ్ సంతాపం తెలియజేశారు.

### ఎలుగు దాడి ప్రాంతంలో ఫారెస్ట్ అధికారుల పర్యటన



అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ అధికారులు

వజ్రపుకొత్తూరు రూరల్: చీపురుపల్లి పంచాయతీ పరిధిలో గల ఎం.గడూరు, డెప్పూరు గ్రామాల్లో శుక్రవారం అటవీ శాఖాధికారులు పర్యటించారు. ఎలుగులు సంచరిస్తున్న పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ మేరకు బాధిత గ్రామాల ప్రజలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఎలుగుల సంచారం, రక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కాశీబుగ్గ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎం.మురళీకృష్ణం నాయుడు మాట్లాడుతూ ఎలుగులు ఉదయం, సాయంత్రం వేళల్లో సంచరించే అవకాశం ఉన్నందున జీడి రైతులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎలుగులు సంచరించే ప్రాంతాల్లో ఫారెస్ట్ బీట్,సెక్షన్ అధికారులు, సిబ్బందితో కూడిన మూడు బృందాలు గాలింపు చర్యలు చేపడతూ ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు.

# భాషా వేడుకకు వేళాయె..!




భాషా సమ్మేళనానికి స్వాగతం పలుకుతున్న సైకత శిల్పం



జనతా మైదానం ప్రాంగణం

- నేటి నుంచి ప్రపంచ ఒడియా భాష సదస్సు


భువనేశ్వర్: రాష్ట్రంలో శనివారం నుంచి ప్రపంచ ప్రథమ ఒడియా భాషా సదస్సు ప్రారంభమవ్వనుంది. ఈ మహోత్సవానికి స్థానిక జనతా మైదానం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఈనెల 5వ తేదీ వరకు నిరవధికంగా 3 రోజుల పాటు సదస్సు కొనసాగుతుంది. వేదిక పరిసరాలు సాహితీ, సాంస్కృతిక, సంప్రదాయ ఆచార వ్యవహారాలను ప్రతిబింబించే రీతిలో అడుగడుగున కుడ్య చిత్రాలు, సైకత శిల్పం, రంగవల్లులతో తీర్చిదిద్దారు. నగరంలో ప్రధాన రహదారులు సాహితీ, భాషావేత్తలకు సాదరంగా స్వాగతం పలుకుతున్నాయి. ఈ సమ్మేళనం ఒడియా భాష, సాహిత్యం, వారసత్వం, ఉనికి, విస్తరణ వంటి అంశాలపై వర్ధమాన తరాలకు అద్భుతమైన సమాచారం అందజేస్తుందని ఆశిస్తున్నారు.





ఆకట్టుకుంటున్న కుడ్య చిత్రాలు

# ఆకాశానికి వెల్లుల్లి ధర



- కేజీ ధర రూ.400
- మరో 10–15 రోజులు ఇదే పరిస్థితి

భువనేశ్వర్: రాష్ట్రంలో ఇటీవల వెల్లుల్లి ధర పెరుగుతూనే ఉంది. తగ్గే సూచనలు కనిపించక సామాన్యులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం కిలో రూ.400 చొప్పున విక్రయిస్తున్నారు. ఖరీఫ్ దిగుబడి వచ్చే వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుందని సమాచారం. ఈ లెక్కన మరో 10 నుంచి 15 రోజుల పాటు ధర అధికంగానే ఉండే అవకాశం ఉంది.

**ప్రతికూల వాతావరణ ప్రభావం**

ఇటీవల సంభవించిన ప్రతికూల వాతావరణ పరిస్థితులు వెల్లుల్లి ఉత్పాదనని ప్రభావితం చేసింది. ఈ పరిస్థితుల కారణంగా పంటలు దెబ్బతిని సరఫరా తగ్గిపోయిందని వ్యాపార వర్గాల సమాచారం. ఒడిశాతో సహ దేశంలోని చాలా ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా ధర దాదాపు రెట్టింపు అయ్యింది. 3 నెలల క్రితం వెల్లుల్లి కిలో రూ.150కి విక్రయించగా, ప్రస్తుతం 100 గ్రాములు రూ.50కి విక్రయిస్తున్నారు. వెల్లుల్లిని ఉత్పత్తి చేసే రాష్ట్రాల్లో అకాల వర్షాలు, భూగర్భ జలాలు క్షీణించడం, రుతు పవనాల ప్రభావం వంటివి ఉత్పత్తి తగ్గడానికి ప్రధాన కారణంగా భావిస్తున్నారు.

**నిండుకున్న నిల్వలు**

ప్రస్తుతం పాత వెల్లుల్లి నిల్వలు నిండుకున్నాయి. కొత్త సరుకు రావడానికి కనీసం 10 నుంచి 15 రోజులు పడుతుందని ఛత్రా బజార్ ట్రేడర్స్ అసోసియేషన్ కార్యదర్శి దేబేంద్ర సాహు తెలిపారు. సరఫరా తగ్గడంతో ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. తాజా సామాగ్రి వచ్చిన తర్వాతే ధర తగ్గుతుందని ఆయన తెలిపారు. కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలలో వేసవి (ఖరీఫ్), చలికాలం (రబీ) సీజన్లలో వెల్లుల్లి అధికంగా పండిస్తారు. భారతదేశంలోని మొత్తం ఉత్పత్తిలో దాదాపు 40 శాతం మహారాష్ట్ర వాటా. అయితే వర్షాభావ పరిస్థితుల వల్ల ఆయా రాష్ట్రాల్లో ఖరీఫ్ పంట దెబ్బతింది. సెప్టెంబర్‌లో వర్షాలు కురియడంతో రైతులు మళ్లీ పంటలు వేయాల్సి వచ్చింది. దీంతో ఉత్పాదన ప్రభావితం అయింది. మరికొన్ని చోట్ల మైచాంగ్ తుఫాన్ కారణంగా ఏర్పడిన అకాల వర్షపాతం పెద్ద మొత్తంలో వెల్లుల్లి పంటలను నాశనం చేసింది. ఇది వెల్లుల్లి తీవ్ర కొరతకు దారితీసింది, మార్కెట్ ధరలను రెట్టింపు చేసింది.


## 'విద్యార్థులు ఆర్మీపై ఆసక్తి కనబర్చాలి'



విద్యార్థులతో బీఎస్ఎఫ్ అధికారులు

మల్కన్‌గిరి: విద్యార్థులు ఇండియన్ ఆర్మీలో చేరేందుకు ఆసక్తి కనబర్చాలని బీఎస్ఎఫ్ అధికారి వీరేంద్ర ప్రతాప్ సింగ్ సూచించారు. స్థానిక డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో కెరీర్ కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇండియన్ ఆర్మీకు ఎలా సన్నద్ధమవ్వాలి అనేది వివరించారు. ఆర్మీలో ఉంటే ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని తెలియజేశారు. మల్కన్‌గిరి జిల్లా అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా రిక్రూట్‌మెంట్ అధికారి అజయ్ దీప్ మాట్లాడుతూ.. అగ్నివీర్ యోజన ద్వారా విద్యార్థులు సైనికులుగా చేరవచ్చన్నారు. దీనికి సంబంధించి ఆసక్తి కలిగిన విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో వివిధ కళాశాలలకు చెందిన 2000 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## కనుమూసిన సాధు మెహర్



సాధు మెహర్(ఫైల్)

భువనేశ్వర్: ప్రముఖ చలన చిత్ర నటుడు సాధు మెహర్ (84) శుక్రవారం ముంబైలోని తన నివాసంలో కన్నుమూశారు. సువర్ణపూర్ జిల్లాలోని మన ముండాలో జన్మించిన ఆయన ఒడియా, హిందీ చిత్రాల్లో నటించారు. భువన్ షోమ్, అంకుర్, మంథన్, మృగయా, భూఖా, శీతరాతి, దేబశిశు, సఫేద్ హాతీ, నిశాంత్, డిజైర్ వంటి చిత్రాలు అయనకు పేరు తెచ్చాయి. 1974లో హిందీ చిత్రం అంకుర్‌లో కిష్టయ్య పాత్రకు ఉత్తమ నటుడిగా జాతీయ చలన చిత్ర పురస్కారం అందుకున్నారు. జాతీయ అవార్డు గెలుచుకున్న తొలి ఒడియా స్టార్‌గా నిలిచాడు. భారతీయ సినిమాకు ఆయన చేసిన కృషికి గాను 2017లో పద్మశ్రీతో సత్కరించారు. మెహర్ 1977లో తన మొదటి చిత్రం అభిమాన్‌కు రచన, దర్శకత్వం వహించారు. ఇది ఒడియా భాషలో అత్యంత ముఖ్యమైన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. అతను మొదటి పిల్లల సైన్స్ ఫిక్షన్ ఒడియా చిత్రం బాబులా (1985)కి దర్శకత్వం వహించాడు. అతను ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టీఐఐ) పూర్వ విద్యార్థి.

**ప్రముఖుల సంతాపం**

నటుడు సాధు మెహర్ మృతిపై గవర్నర్ రఘుబర దాస్, సీఎం నవీన్ పట్నాయక్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం బాధాకరమని గవర్నర్ సంతాప సందేశంలో పేర్కొన్నారు. ఉభయ హిందీ, ఒడియా భాషల చలన చిత్రాల్లో దర్శకత్వం, నటనలో ప్రతిభ కనబర్చారని పేర్కొన్నారు. సాధు నటన, దర్శకత్వంలో జాతీయ స్థాయిలో ప్రశంసనీయమైన వ్యక్తి అని సీఎం కొనియాడారు. ఒడియా, హిందీ సినిమాల్లో నటనతో తనదైన ముద్ర వేశారని గుర్తు చేసుకున్నారు. ఆయన నిష్క్రమణ కళా రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# వంతెనల నిర్మాణాలకు భూమిపూజ



భూమిపూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి తదితరులు



ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న గొడొపొదర్ మహిళలు

జయపురం: సమితిలో మూడు వంతెనల నిర్మాణాలకు ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ వంతెనలు జిల్లా గ్రామీణ అభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం రూ.16 కోట్ల వ్యయంతో వంతెనలు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే బాహిణీపతి మాట్లాడుతూ వంతెనల నిర్మాణాల వలన పలు గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అందువలన నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. నువాపుట్ – దిగాపూర్‌లను కలుపుతూ కొలాబ్ నదిపై చేపట్టనున్న వంతెన నిర్మాణానికి రూ.4,49,66,000 ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే నువాపుట్ గ్రామ ప్రజలు లబ్ధి పొందుతారన్నారు.

ఇప్పటివరకు ఇక్కడి ప్రజలు నదిని దాటేందుకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే 48వ రాష్ట్ర రహదారిని మాలికర్పి గ్రామానికి కలిపేందుకు తెలంగిరి నదిపై మరో వంతెన రూ.6,18,95,000లతో నిర్మించనున్నట్లు వెల్లడించారు. దీనివలన కేవిడి, బిక్షణిగుడ, నువాగుడ, మాలికర్పి గ్రామాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. అదేవిధంగా కొరాపుట్–ఉమ్మరిలను కలుపుతూ రూ.5,43,31,000ల వ్యయంతో పుట్ర నదిపై ఒక వంతెన నిర్మాణం జరుగుతుందన్నారు. దీంతో గొడొపొదర్, రొండాపల్లి గ్రామ పంచాయతీల ప్రజలకు లబ్ధి కలుగుతుందని వెల్లడించారు. కార్యక్రమాల్లో జయపురం సమితి అధికారులు, పంచాయతీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎస్పీని కలిసిన పోలీసు అధికారులు

శ్రీకాకుళం క్రైమ్ : సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాకు వచ్చిన వివిధ హోదాల్లో గల పోలీసు అధికారులు ఎస్పీ జీఆర్ రాధికను శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛాలను అందజేశారు. వీరిలో రెండో పట్టణ ఇన్‌స్పెక్టర్ గుండుమోను ఉమామహేశ్వరరావు, ఆమదాలవలస, జీఆర్‌పురం, ఎచ్చెర్ల, జలుమూరు, పొందూరు ఎస్ఐలు కె.వెంకటేష్, కె.గోవిందరావు, ఎస్.చిరంజీవి, కె.మధుసూదనరావు, వై.రవికుమార్‌లతో పాటు అల్లూరి సీతారామరాజు జిల్లా ర్యాంకర్ ఎస్ఐ గోవిందరావులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలకు అంతా సిద్ధంగా ఉండాలని, ప్రజలకు పారదర్శక సేవలందించి ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు రాకుండా విధు లు నిర్వర్తించాలని సూచించారు.

## జాతీయ పురస్కారానికి ఇచ్ఛాపురం కళాకారులు

ఇచ్ఛాపురం రూరల్: తెలంగాణ రాష్ట్రం హనుమకొండకు చెందిన యువచైతన్య వెల్ఫేర్, విశ్వకర్మ సేవా ఫౌండేషన్ సంయుక్తంగా అందజేసే తెలుగు వెలుగు విశిష్ట కళారత్న జాతీయ పురస్కారానికి ఇచ్ఛాపురానికి చెందిన కళాకారులు ఎంపికయ్యారు. టి.బరంపురానికి చెందిన ప్రముఖ జానపద కళాకారుడు, నంది అవార్డు గ్రహీత తిప్పన ధనుంజయరెడ్డి, ఆల్ ఇండియా కళా రంగం జిల్లా ఉపాధ్యక్షురాలు పెదిన ధనావతిలు ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. ఆదివారం హనుమకొండలో ఆదివారం జరగనున్న స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంత్యుత్సవాల ముగింపు సందర్భంగా ఈ పురస్కారాలను అందజేస్తున్నట్లు ధనుంజయరెడ్డి, ధనావతిలు శుక్రవారం తెలిపారు.

## అంతర పంటలతో అధిక లాభం



రణస్థలంలో అంతర పంటలను పరిశీలిస్తున్న రాజస్థాన్ బృంద సభ్యులు

రణస్థలం: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో మొక్కజొన్నలో అంతర పంటల పండించడం రైతన్నలకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని ప్రకృతి వ్యవసాయ రీజనల్ టెక్నికల్ అధికారి హేమసుందర్, అదనపు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ధనుంజయరావులు తెలిపారు. మండలంలోని రణస్థలం గ్రామంలో పెద్దింటి రాజేశ్వరి మొక్కజొన్నలో వేసిన అంతర పంటలు బెండ, చిక్కుడు, ముల్లంగి, సరిహద్దు పంటగా సజ్జలు వేయడాన్ని రాజస్థాన్ బృంద సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర పంటల వల్ల ఒక ఎకరానికి రూ. 8వేలు వరకు అదనంగా ఆర్జించవచ్చని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఘన, ద్రవ జీవామృతాలను ఉపయోగించడం వల్ల రైతులకు పెట్టుబడి తగ్గించవచ్చునని వివరించారు. అలాగే 15 సెంట్లు విస్తీర్ణంలో ఏటీఎం మోడల్‌లో వేసిన కూరగాయల పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏలు గోవిందరెడ్డి, బాబాజీ, మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు ఉన్నారు.

# ఘనంగా గాయత్రి మహాయజ్ఞం



యజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం

కొరాపుట్: జిల్లాలో సిమిలిగుడ పట్టణంలోని సత్యనగర్ కాలేజీ రోడ్డులో గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో గాయత్రి మహాయజ్ఞం వైభవంగా నిర్వహిస్తున్నారు. కొరాపుట్, రాయగడ, మల్కన్‌గిరి, నబరంగ్‌పూర్ జిల్లాల నుంచి గాయత్రి పరివార్ సంస్థలు ఈ యజ్ఞంలో మమేకమయ్యాయి. విశ్వశాంతి కోసం యజ్ఞం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. ఆదివారం వరకు జరిగే ఈ యజ్ఞంలో ప్రతిరోజూ వందలాది మంది భక్తులకు ఉచిత ఆహార ప్రసాదం అందిస్తున్నారు. కార్యక్రమాల్లో కొరాపుట్ ఎమ్మెల్యే, జిల్లా ప్రణాళికా సంఘం అధ్యక్షుడు రఘురాం పొడాల్, పొటంగి ఎమ్మెల్యే పీతం పాఢీలు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ట్రైబల్ వెల్ఫేర్‌లో 17మందికి పదోన్నతులు



పదోన్నతి ఆర్డర్లను పంపిణీ చేస్తున్న పీవో కల్పనాకుమారి

సీతంపేట: ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో సీతంపేట ఐటీడీఏ పరిధిలో నిర్వహిస్తున్న ఆశ్రమపాఠశాలల్లో పనిచేస్తున్న 17 మంది ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి కల్పించినట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి తెలిపారు. ఈమేరకు పదోన్నతి పత్రాలను వారికి శుక్రవారం అందజేశారు. తెలుగు, హిందీ, గణితం 2 పోస్టులు చొప్పున, బయాలాజికల్ సైన్స్ 3, సాంఘికశాస్త్రం 4, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం 4 పోస్టులకు పదోన్నతి కల్పించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ అన్నాదొర, ఏఎంవో కోటిబాబు, సూపరింటెండెంట్ దేశ్ తదితరులు పాల్గొన్నారు.

### 5 కిలోల గంజాయి పట్టివేత



గంజాయి నిందితులతో ఎస్.కోట పోలీసులు

శృంగవరపుకోట: విశాఖ–అరకు రోడ్డులో మరోమారు పోలీసులకు గంజాయి పట్టుబడింది. ఈ మేరకు ఎస్.కోట ఎస్సై గంగరాజు శుక్రవారం ఉదయం వాహన తనిఖీలు చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పద స్థితిలో పట్టుబడ్డారు. వారిని ఆపే ప్రయత్నం చేయగా పోలీసుల్ని గమనించి పారిపోయేందుకు యత్నించారు. దీంతో వారిని ఛేదించి పట్టుకుని సోదా చేయగా వారి దగ్గర 5కిలోల గంజాయి పట్టుబడింది. గంజాయి తరలిస్తున్న వ్యక్తులను మహారాష్ట్రలోని భీమ్‌నగర్‌కు చెందిన షేక్ మున్నా, లాతూరు గ్రామానికి చెందిన రాహుల్ గైక్వాడ్‌గా గుర్తించి అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### ఫైనాన్స్ వ్యాపారి ఇంట్లో బంగారు ఆభరణాల చోరీ



బాధితుడు కృష్ణారెడ్డి

బొండపల్లి: మండలంలోని బోడసింగిపేట కోర్టు కాలనీలో నివాసం ఉంటున్న తన ఇంట్లో బంగారు ఆభరణాలతో పాటు నగదు చోరీకి గురైనట్లు బాధితుడైన ఓ ఫైనాన్స్ వ్యాపారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.లక్ష్మణరావు తెలిపారు. తూర్పు గోదావరికి చెందిన వ్యాపారి కర్రి కృష్ణారెడ్డి ఇంట్లో గురువారం అర్ధరాత్రి బీరువాను తెరిచి అందులో ఉంచిన పావు తక్కువ ఆరుతులాల బంగారు ఆభరణాలతో పాటు, రూ.3 వేల నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయినట్లుగా ఫిర్యాదు చేయడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టినట్లు చెప్పారు. బాధితుడితో పాటు షేక్ మీరా అనే వ్యక్తి రాత్రి 11 గంటల వరకు ఉన్నాడని, షేక్ మీరా వెళ్లిన తర్వాత ఈ చోరీ జరిగినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడని చెప్పారు.

### రెండు కొండచిలువల హతం



హతమైన కొండచిలువలు

జామి: మండలంలోని బలరాంపురం గ్రామంలో రైతుల చేతిలో రెండు కొండచిలువలు శుక్రవారం హతమయ్యాయి. గ్రామంలోని పులిగొమ్ము సమీపంలో ఉన్న పొలంలోకి రైతులు వెళ్తున్న సమయంలో కొండచిలువలు కనిపించాయి. దీంతో నలుగురు రైతులు వాటిని హతం చేశారు. వాటిలో ఒకటి సుమారు 10 అడుగులు, మరొకటి 9అడుగులు ఉంటాయని స్థానికులు తెలిపారు.

### ఎస్‌ఈబీ అసిస్టెంట్ కమిషనర్‌గా రవికుమార్ రెడ్డి

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లా ఎస్‌ఈబీ అసిస్టెంట్ కమిషనర్‌గా ఎం.రవికుమార్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా ఆవిర్భావం తరువాత అసిస్టెంట్ కమిషనర్ పోస్టును తొలిసారిగా నియమించారు. జిల్లాలో మొట్టమొదటి అసిస్టెంట్ కమిషనర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ఎస్‌ఈబీ పరిధిలో సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. సమస్యలు ఏవైనా ఉంటే తక్షణమే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

# కనికరించు మాతా..!

- కొండడాబాలులో వ్యాకులమాత యాత్ర రేపు
- 1878లో ఏర్పాటైన చర్చి
- నాలుగు రాష్ట్రాల నుంచి రానున్న భక్తులు
- భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీస్ సిబ్బంది



వ్యాకులమాత పుణ్యక్షేత్రం ముఖద్వారం

కొత్తవలస: మండలంలోని కొండడాబాలు వ్యాకుల మాత కొలిచినవారికి కొంగుబంగారంగా విరాజిల్లుతోంది. దక్షిణ భారతదేశంలోనే అత్యంత పురాతనమైన స్థలం వ్యాకులమాత పుణ్యక్షేత్రం. ఈ పుణ్యక్షేత్రాన్ని 1817వ సంవత్సరంలో ఏర్పాటు చేసినట్లు చరిత్ర చెబుతోంది. ఇక్కడ రోమన్ కేథలిక్ మిషనరీ పద్ధతిలో ప్రార్థన కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. ఇక్కడ ప్రతి ఏడాది ఫిబ్రవరి నెలలో వచ్చే మొదటి ఆదివారం మహాయాత్ర జరుగుతుంది.

#### పుణ్యక్షేత్రం చరిత్ర

ఈస్టిండియా కంపెనీ పాలనలో 1876లో సంభవించిన భారీ తుఫాన్ కారణంగా విశాఖపట్నం జిల్లా జ్ఞానాపురం దగ్గర గల చర్చిలు అతలాకుతలమయాయి. దీంతో అక్కడ గల క్రైస్తవ భక్తులు తమ సొంత గ్రామమైన లక్కవరపుకోట మండలం గనివాడ, నిడిగట్టు గ్రామాలకు చేరుకున్నారు. 1877వ సంవత్సరంలో ఫాదర్ అలిక్స్‌రీకాగా సాయంతో కొత్తవలస మండలంలోని గొల్లలపాలెం సమీపంలో గల కొండపైన ఒక పెద్ద కమ్మలశాల ఏర్పాటు చేసి చర్చిని నిర్వహించడం మొదలుపెట్టారు.1890లో కొండను చదును చేసి బిషప్ జె.ఎం.టిస్సో చేతుల మీదగా గ్రీకు ప్రాంకోశైలిలో చర్చి నిర్మాణం ప్రారంభించి వ్యాకులమాతగా నామకరమణం చేశారు. అప్పట్లో ఈ ప్రాంతంలో దాబాలు లేకపోవడంతో ఈ కొండపైన పెద్ద డాబాలను నిర్మించారు. దీంతో నాటి నుంచి ఈ క్షేత్రాన్ని కొండడాబాలుగా పిలుస్తారు.

#### భారీ గొర్రెల కాపరి విగ్రహం

కొండడాబాల వ్యాకులమాత చర్చిని అన్ని వసతులతో పూర్తిస్థాయిలో నిర్మించి 2020 నాటికి 130 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఇందుకు గుర్తుగా భారతదేశంలోనేనే అత్యంత ఎత్తైన భారీ గొర్రెల కాపరి క్రీస్తు స్వరూపం ఇక్కడ ఏర్పాటు చేశారు. క్రీస్తు జీవించిన కాలం ఆధారంగా 331/2 అడుగుల ఎత్తులో ఈ భారీ విగ్రహాన్ని నిర్మించారు. ఈ విగ్రహం ఈ క్షేత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

#### ప్రతి ఏటా మహాయాత్ర

ఫిబ్రవరి నెల మొదటి ఆదివారం ఈ పుణ్యక్షేత్రంలో ప్రతి ఏడాదీ మహాయాత్రను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.9 రోజుల ముందు నుంచి నవదిన పూజా ప్రార్థనలు నిర్వహిస్తుంటారు.9 రోజులు పాటు ప్రతిరోజూ సాయంత్రం జపమాల, దివ్య బలిపూజ, నవదిన ప్రార్థనలు నిర్వహిస్తారు. 9వ రోజు పర్వదినాన మహా యాత్ర జరుగుతుంది.

#### ఫ్రాన్స్ నుంచి తెచ్చి విగ్రహ ప్రతిష్ట

1914వ సంత్సరంలో ఫాదర్ రోస్పియోన్ సుమారు రూ.6వేలు వెచ్చించి ఫ్రాన్స్ దేశం నుంచి ప్రత్యేకంగా తెప్పించిన మేరీమాత విగ్రహాన్ని ఇక్కడ ప్రతిష్టించారు. తన బిడ్డకు గోరుముద్దలు తినిపించాల్సిన తల్లి.. బిడ్డ పార్థివదేహాన్ని ఒడిలో పెట్టుకుని తన మనోవేదనను గుండెల్లో దాచుకున్న వ్యాకులమాతగా (కనికరమాత) ఆమె స్వరూపం ఇక్కడి విశేషం.



క్షేత్రంలో అకట్టుకుంటున్న బాలమేరీమాత



భారతదేశంలోనే ఎత్తైన గొర్రెలకాపరి క్రీస్తు స్వరూపం



ఫ్రాన్స్ దేశం నుంచి తెచ్చి ప్రతిష్టించిన మేరీమాత విగ్రహం

ఒడిశా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు ఈ యాత్రకు వస్తారు.ఇందుకోసం చర్చి నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేహిస్తున్నారు.

#### అతిపెద్ద బోర్డింగ్ పాఠశాల

రోమన్ కేథలిక్ మిషన్ ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో విద్యాభివృద్ధికి 1913వ సంవత్సరంలో మొట్టమొదటి సారిగా బోర్డింగ్ పాఠశాలను ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలలో ఎంతో మంది విద్యాబుద్ధులు నేర్చుకుని ఉన్నతమైన స్థానాల్లో స్థిరపడ్డారు. అలాగే ఫాదర్స్ శిక్షణ విశ్వవిద్యాలయం కూడా ఇక్కడ ఏర్పాటు చేశారు.

#### యాత్రకు ఏర్పాట్లు పూర్తి



ఆదివారం నిర్వహించనున్న యాత్రకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. యాత్రకు నాలుగు రాష్ట్రాల నుంచి సుమారు లక్ష మంది భక్తులు వచ్చే అవకాశం ఉంది. యాత్రికుల రాకపోకల కోసం విశాఖపట్నం జిల్లా సింహాచలం, మద్దిలపాలెం డిపోల నుంచి ప్రత్యేక బస్సులను ఏపీఎస్‌ఆర్‌టీసీ ఏర్పాటు చేసింది. యాత్రికులకు తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతలను ఇప్పటికే ఏర్పాటు చేశాం.

డాక్టర్ గొండాద రాజు, కొండడాబాలు విచారణకర్త

#### భక్తుల భద్రతకు భారీ బందోబస్తు



వ్యాకులమాత యాత్ర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశాం. డీఎస్పీ ఆధ్వర్యంలో నలుగురు సీఐలు, 16 మంది ఎస్సైలు, 230 మంది పోలీస్ సిబ్బది బందోబస్తు నిర్వహిస్తారు. యాత్రికులు సహకరించాలి.

–వి.చంద్రశేఖర్, కొత్తవలస సీఐ

# జిల్లాలో రెండు ఇండస్ట్రియల్ క్లస్టర్లు

- యూనిట్ల స్థాపనపై దృష్టి పెట్టాలి
- డీఐఈపీసీ సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి



హాజరైన అధికారులు

విజయనగరం అర్బన్: ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా వివిధ పారిశ్రామిక యూనిట్ల స్థాపనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఈ మేరకు జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక మండలి (డీఐఈపీసీ) సమావేశం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలో కొత్త పరిశ్రమలు, పారిశ్రామికవాడల స్థాపన విస్తరణకు ఉన్న అవకాశాలు, భూముల కేటాయింపు, రాయితీల విడుదల తదితర అంశాలపై సమావేశంలో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో రెండు ఇండస్ట్రియల్ క్లస్టర్ల ఏర్పాటుకు పనులు వేగవంతం చేయాలని కోరారు. మెరకముడిదాం మండలం గర్భాం వద్ద సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్షన్ ప్లాంట్స్, భీమాళి వద్ద మామిడి తాండ్ర తయారీ క్లస్టర్‌ను ఏర్పాటు చేయడానికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా వివిధ పథకాల కింద ఇప్పటివరకు అనుమతులు మంజూరు చేసిన యూనిట్లను వెంటనే ప్రారంభించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు డీఐసీ, కేవీఐసీ, కేవీఐబీల ద్వారా సుమారు 1,152 యూనిట్లను మంజూరయ్యాయని, వాటిలో ఇప్పటివరకు 681 యూనిట్లు ఏర్పాటయ్యాయన్నారు. మిగిలిన వాటిని స్థాపించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరిశ్రమలు, ఏపీఐఐసీ ఆధ్వర్యంలో పారిశ్రామిక వాడల స్థాపనకు పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలు కార్యరూపం దాల్చడానికి తగిన చర్యలను వెంటనే చేపట్టాలని సూచించారు. వివిధ పరిశ్రమలకు భూముల కేటాయింపు, భూముల స్థితిలో మార్పులు, అభివృద్ధి, ఎంఎస్‌ఎంఈ సమృద్ధి సర్వే, ఫ్లేటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్, వివిధ పరిశ్రమల విస్తరణ తదితర అంశాలపై సమావేశంలో చర్చించి భూ సంబంధిత అంశాలపై దృష్టిపెట్టి తగిన చర్యలు తీసుకోవాలని ఆర్‌డీఓను ఆదేశించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ ఆర్.పాపారావు, డీడీ నాగేశ్వరరావు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మురళీమోహన్, వ్యవసాయశాఖ జేడీ తారక రామారావు, ఉద్యానశాఖ డీడీ జమదగ్ని, మత్స్య శాఖ డీడీ నిర్మలాకుమారి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రాజా, ఎల్‌డీఎం ఎ.శ్రీనివాసరావు, ఆర్‌డీఓ ఎంవీసూర్యకళ, వివిధ శాఖల అధికారులు, కమిటీ సభ్యులు, పరిశ్రమల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌కు అభినందనలు



నీరజను, కోచ్ చల్లా రామును అభినందిస్తున్న సత్య విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు

విజయనగరం అర్బన్: నెల్లిమర్ల మండలంలోని కొండవెలగాడ గ్రామానికి చెందిన జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ నీరజను సత్య విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు అభినందించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. ఇటీవల ఈటానగర్(అరుణాచల ప్రదేశ్)లో జరిగిన యూత్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్‌లో 40 కేజీల విభాగంలో కాంస్య పతకం, అలాగే తమిళనాడులో జరిగిన ఖేలో ఇండియా యూత్‌గేమ్స్‌లో కూడా 40 కేజీల విభాగంలో కాంస్య పతకాన్ని నీరజ కైవసం చేసుకున్న సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.సాయిదేవమణి, కోచ్ చల్లా రాము, కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్లు కెప్టెన్ ఎం.సత్యవేణి, ఎం.ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.

# అగ్నివీర్-వాయు నియామకాలకు నోటిఫికేషన్

- 6లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- నియామక అధికారి గుర్‌ప్రీత్ అత్వాల్

విజయనగరం అర్బన్: భారతీయ వాయుసేనలో అగ్నివీర్–వాయు నియామకాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల రిక్రూటింగ్ అధికారి, వింగ్‌కమాండర్ గుర్‌ప్రీత్ అత్వాల్ శుక్రవారం తెలిపారు. అగ్నివీర్ నియామకాల కోసం ఆసక్తిగల అర్హులైన అభ్యర్థులు ఈ నెల 6వ తేదీలో 'అగ్నిపత్వయు.సీడీఏసీ.ఐఎన్' వెబ్‌సైట్‌లో తమ దరఖాస్తులను పంపించాలని సూచించారు. ఈ రిక్రూట్‌మెంట్ ఎంపిక పరీక్ష మార్చి 17 నుంచి జరుగుతుందని తెలిపారు.

2004 జనవరి 2 నుంచి 2007 జూలై 2 వ తేదీ మధ్య జన్మించిన వారు మాత్రమే దరఖాస్తు చేసేందుకు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులంతా అవివాహితులై ఉండాలని స్పష్టం చేశారు. సైన్స్ సబ్జెక్టులకు సంబంధించి అభ్యర్థులు ఇంటర్‌మీడియట్‌లో మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, ఇంగ్లీషు సబ్జెక్టులు కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఆటో మొబైల్, కంప్యూటర్ సైన్స్, ఇనుస్ట్రుమెంటేషన్ టెక్నాలజీ, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ తదితర డిప్లమో కోర్సుల్లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు కూడా దరఖాస్తు చేసేందుకు అర్హులని తెలిపారు. దరఖాస్తు చేసే అభ్యర్థులు రూ.550తో పాటు జీఎస్‌టీ చార్జీలు కూడా చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇతర అర్హతలు, నియామకాలకు అవసరమైన వైద్య ప్రమాణాలు, ఇతర షరతులు, నిబంధనల పూర్తి సమాచారం కోసం పైన తెలిపిన వెబ్‌సైట్‌లో చూడాలని పేర్కొన్నారు. అగ్నిపథ్ పథకంలో క్లరికల్, టెక్నికల్ క్యాడర్‌లో యువత ఇకపై నాలుగేళ్లు మాత్రమే సేవలు అందించాల్సి ఉంటుందని, నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారిలో 25 శాతం మందిని మాత్రమే తదుపరి శాశ్వత స్థాయి నియామకాలను ఎంపిక చేస్తారని తెలిపారు. దీనివల్ల యువత సైన్యంలో జీవితకాలం పాటు కొనసాగాల్సిన పనిలేకుండానే భారతీయ సైనిక దళాల్లో పనిచేయాలన్న తమ కోరిక నెరవేర్చుకోవచ్చన్నారు.

### పాఠశాల భవనాలను సందర్శించిన డీఈవో



పాఠశాలను సందర్శిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

మక్కువ: మండలంలోని ఆలగురువు, కొండబుచ్చంపేట, శంబర పాఠశాల భవనాలను పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్ కుమార్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల భవనాలలో ర్యాంపులు, నీటి వసతి, మరుగుదొడ్ల పనితీరును పరిశీలించారు. ఎలక్షన్ సమయంలో ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని మండల విద్యాశాఖ అధికారులు పెంట సత్యనారాయణ, శ్యామ సుందరరావులను ఈ మేరకు ఆదేశించారు.

# 40 లీటర్ల సారా స్వాధీనం



బెల్లపు ఊటలు ధ్వంసం చేస్తున్న రూరల్ ఎస్సై వెంకటరమణ, పోలీసులు



నిందితుడితో ఎస్సై ప్రశాంత్ కుమార్

సాలూరు: మండలంలోని నేరెళ్లవలస సరిహద్దు ప్రాంతంలో దాడిచేసి సారా స్వాధీనం చేసుకున్నామని రూరల్ ఎస్సై వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ, ముందస్తు సమాచారం మేరకు నేరెళ్లవలస సరిహద్దు ప్రాంతంలో సిబ్బందితో కలిసి దాడిచేసి 40 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, 4200 లీటర్ల బెల్ల పు ఊటలు ధ్వంసం చేసి కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

#### సారా తరలిస్తున్న యువకుడి అరెస్ట్

పాలకొండ రూరల్: స్థానిక వెంకమ్మపేట కాలనీ మీదుగా ద్విచక్రవాహనంపై 20లీటర్ల సారాను తరలిస్తున్న యువకుడు ముఖలింగాన్ని పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం ఈ ప్రాంతంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఆ యువకుడు సారా తరలిస్తున్నట్లు గుర్తించామని ఎస్సై ఎస్.ప్రశాంత్ కుమార్ తెలిపారు. సారాతోపాటు, వాహనాన్ని సీజ్‌చేసి, నిందితుడిని అరెస్టు చేశామని చెప్పారు.



మాట్లాడుతున్న సీఐ మురళీధర్

#### సారా, బెల్ట్‌షాపులపై ఉక్కుపాదం

బొబ్బిలి: ఏజెన్సీలో సారా, మైదాన ప్రాంతాల్లో బెల్ట్ షాపులపై ఉక్కుపాదం మోపామని ఎస్‌ఈబీ సీఐగా కొత్తగా విధుల్లో చేరిన బీవీ మురళీధర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను బాధ్యతలు స్వీకరించిన వెంటనే సర్కిల్‌లో 11 బెల్ట్ షాపులు మూసివేయించి 11 మందిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే ఏజెన్సీ గ్రామాల్లో 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా సారా తయారు చేస్తున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# అంగన్‌వాడీ కేంద్రాల ఆధునికీకరణ

- జిల్లాలో 752 కేంద్రాల అభివృద్ధికి చర్యలు
- రూ.7.5 కోట్ల నిధుల కేటాయింపు
- కార్పొరేట్ తరహా కేంద్రాలుగా కొత్తసొబగు



కొత్తకొప్పెర్ల -2 అంగన్‌వాడీ కేంద్రం



కొత్తకొప్పెర్ల-2 అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు

పూసపాటిరేగ: జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల భవనాల రూపురేఖలు మారనున్నాయి. నాడు-నేడు పథకం కింద అంగన్‌వాడీ సెంటర్ల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిధులు కేటాయించారు. మనబడి నాడు నేడు పథకంలో మాదిరిగా అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునికీకరించనున్నారు. ఈ మేరకు జిల్లాలో గల 752 అంగన్‌వాడీ కేంద్రాల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఇందుకోసం రూ.7.5 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించినట్లు ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. ఆ నిధులతో ఆధునికీకరణ పనులు చేపడతారు. పాడైన భవనాలకు మరమ్మతులు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల ఏర్పాటు, మరమ్మతులు వంటి పనులు నిర్వహిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాలను పెయింటింగులతో ముస్తాబు చేసి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దనున్నారు. మారుమూల గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు సైతం కొత్తసొబగులు సంతరించుకోనున్నాయి.

#### మదర్స్ కమిటీ ద్వారా పనులు

ప్రభుత్వం మంజూరు చేసిన నాడునేడు ఫేజ్-2 బి పనుల నిధులను మదర్స్ కమిటీ ద్వారా ఖర్చు చేయనున్నారు. ఈ కమిటీలో అంగన్‌వాడీ వర్కర్ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్, హెచ్‌ఎం, అంగన్‌వాడీ కేంద్రంలో 1 నుంచి 5 ఏళ్ల లోపు పిల్లల పేర్లు నమోదు చేసుకున్న ముగ్గురు తల్లులతో పాటు సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్ కమిటీలో సభ్యులుగా ఉంటారు. వారి ద్వారా పనులు చేపట్టనున్నారు.

#### త్వరలో ఆధునికీకరణ పనులు



జిల్లాలోని 752 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆధునికీకరణ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఆయా కేంద్రాలకు నిధుల కేటాయింపుపై ఉత్తర్వులు ఇచ్చాం. అంగన్‌వాడీ కేంద్రాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేలా కృషి చేస్తాం. మదర్స్ కమిటీ ద్వారా అభివృద్ధి పనులు చేపడతాం.

బి.శాంతకుమారి, ఐసీడీఎస్ పీడీ, విజయనగరం

#### తల్లుల కమిటీ ద్వారా నిధుల ఖర్చు



ఆధునికీకరణ పనుల నిధులు మదర్స్ కమిటీ సభ్యులతో ఖర్చు చేయిస్తాం. మదర్స్ కమిటీ ద్వారా బ్యాంకులో జాయింట్ అకౌంట్ తెరిచాం. ఇప్పటికే నిధులు నేరుగా వారి ఖాతాలో జమఅవుతున్నాయి. వారి పర్యవేక్షణలోనే అభివృద్ధి పనులు జరుగుతాయి.

బి.ఉమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్త, కొత్తకొప్పెర్ల-2, పూసపాటిరేగ మండలం

### పోలీసులకు సహాయంగా ఉంటాం

- ఏపీఎస్పీ అడిషినల్ డీజీపీ అతుల్‌సింగ్



బెటాలియన్‌లోని పోలీస్ దర్బార్‌లో మాట్లాడుతున్న ఏపీఎస్పీ బెటాలియన్ అడిషనల్ డీజీపీ అతుల్‌సింగ్

డెంకాడ: ఏపీఎస్పీ పోలీసుల సంక్షేమానికి సహాయంగా ఉంటామని ఏపీఎస్పీ అడిషినల్ డీజీపీ అతుల్‌సింగ్ అన్నారు. ఏపీఎస్పీ చింతలవలస ఐదో బెటాలియన్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. బెటాలియన్‌లోని ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్, మ్యాథ్స్ ప్రాజెక్టులను తిలకించి, అభినందించారు. వారి ఎదుగుదలకు పలు సూచనలు చేశారు. బెటాలియన్‌లోని హాస్పటల్, సీసీ స్టోర్, యూనిట్ క్యాంటీన్‌ను సందర్శించారు. అనంతరం పోలీస్ సిబ్బందితో దర్బార్ నిర్వహించారు. పోలీసుల సందేహాలను నివృత్తి చేశారు. పి.శంకరరావు, ఎల్.కిరణ్‌కుమార్ అతుల్‌సింగ్ చేతుల మీదుగా పదోన్నతి పత్రాలు అందుకున్నారు. కార్యక్రమంలో కమాండెంట్ రాహుల్‌దేవ్ శర్మ, అడిషినల్ కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు, అసిస్టెంట్ కమాండెంట్‌లు డి.మురళికుమార్, జి.లక్ష్మినారాయణ్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



దర్బార్‌లో పాల్గొన్న బెటాలియన్ పోలీసులు